క్లుప్తంగా

ఘనంగా గౌరీదేవి ప్రతిష్ట



గౌరీదేవిని ఊరేగింపుగా తీసుకెళుతున్న ఆర్యవైశ్య మహిళలు

మైదుకూరు : కార్తిక మాసంలో గౌరీదేవికి ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించేందుకు స్థానిక ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో బుధవారం గౌరీదేవి ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. స్థానిక వరసిద్ధి వినాయక ఆలయం నుంచి అమ్మవారిని ఆర్యవైశ్య మహిళలు ఊరేగింపుగా అమ్మవారిశాలకు తీసుకెళ్లి ప్రతిష్టించారు. గురువారం ఉదయం దంపతులచే గౌరీ పూజను, సాయంత్రం 6 గంటలకు దీపోత్సవాన్ని నిర్వహిస్తామని ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు మాలేపాటి పద్మజ తెలిపారు. 22వ తేదీ శుక్రవారం సామూహిక వ్రతాన్ని నిర్వహిస్తామని, 23న ఆర్యవైశ్య కన్యకలచే వ్రతం, సాయంత్రం నోములు ఉంటాయని వివరించారు. 24న శనివారం ఉదయం 10.30 గంటలకు గౌరీదేవిని ఊరేగింపుగా తీసుకెళ్లి పట్టణ శివారులోని ఎర్రచెరువులో నిమజ్జనం చేస్తామని తెలిపారు. అనంతరం వన భోజన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

కాలువను పూడ్చి వేయించిన అధికారులు



పంట పొలాలకు వెళ్లే రస్తాలో కాలువను పూడ్చి వేసిన దృశ్యం

చాపాడు : మండల పరిధిలోని నరహరిపురం గ్రామం వద్ద పంట పొలాలల్లో ఈనెల 14న రాత్రి తీయించిన కాలువను బుధవారం రెవెన్యూ, కేసీ అధికారులు పూడ్చించారు. నరహరిపురం గ్రామానికి చెందిన ఓ రైతు సాగు నీరు కోసం పొలాలకు వెళ్లే రస్తా మధ్యలో పంట కాలువను తీయించాడు. ఇలా అక్రమంగా పంట కాలువ తీయటంపై ఈనెల 16న పత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. ఇదే క్రమంలో దారి సమస్య ఉన్న బాధిత రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మండల తహసీల్దార్ రమాకుమారి పంట పొలాలకు వెళ్లే రస్తా మధ్యలో తీసిన కాలువను పూడ్చి వేయించారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



సీపీఎం జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అన్వేష్, గురవయ్య

కలసపాడు : కడప నగరంలో డిసెంబర్ 14, 15వ తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్, మండల కార్యదర్శి గురవయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన కలసపాడులో శాఖ మహాసభ నిర్వహించి మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై నిత్యం ధరలను పెంచుతూ పన్నుల భారాలు మోపుతుందన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆదాయాలు లేక నిరుద్యోగంతో సతమతమవుతున్నారని తెలిపారు. జిల్లాలో 28 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలసపాడు సీపీఎం శాఖ కార్యదర్శిగా దాసరిప్రవీణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ సభ్యులు సుదర్శన్, ప్రవీణ్, విజయమ్మ, హుస్సేన్‌పీరా తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ అందిస్తాం



పగడాలపల్లె విద్యుత్ స్టేషన్‌లో ఆర్‌డీఎస్ఎస్ స్కీంను ప్రారంభిస్తున్న ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ భరణి

కాశినాయన : ప్రజలకు మెరుగైన విద్యుత్ అందిస్తామని ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ భరణి తెలిపారు. బుధవారం మండలంలోని పగడాలపల్లె సబ్‌స్టేషన్‌లో జిల్లాలోనే మొట్టమొదటిసారిగా ఆర్‌డీఎస్ఎస్ స్కీంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటగా పగడాలపల్లె సబ్‌స్టేషన్‌లో ఆర్‌డీఎస్ఎస్ స్కీంను ప్రారంభించామని పేర్కొన్నారు. పాలగిరి, పగడాలపల్లె, సావిశెట్టిపల్లె గ్రామాల్లో వ్యవసాయానికి సంబంధం లేకుండా 11 కె.వి. ఫీడర్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. దీంతో ఇల్లు, కమర్షియల్, ఇండస్ట్రీస్ సర్వీసులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. ఈ స్కీంను మండలంలోని అన్ని గ్రామాల్లో విస్తరించామని, ఇప్పటికే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ డీఈ భాస్కర్, పోరుమామిళ్ల ఏడీ రవిచంద్ర, ఏఈలు రఘు, రవీంద్రనాథ్‌రెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

■ మంచు దుప్పటిలా..



వెంగలాయపల్లె-పగిడాల దారిలో మంచులో లైటు వేసుకుని వెళుతున్న ద్విచక్ర వాహనదారుడు



పత్తిపంటపై కురుస్తున్న మంచు

నాలుగైదు రోజులుగా అర్ధరాత్రి నుండి ఉదయం 8 గంటల వరకు మంచు (మొగిలి) ఏకదాటిగా కురవడంతో ప్రజలు, వాహనదారులు, పొలాలకు వెళ్లే కూలీలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఉదయించే సూర్యుడు కూడా చిన్నబోయాడు. మంచు ఇలా కురవడం వల్ల పంటలకు ఉన్న పూత రాలిపోతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బుధవారం తెల్లవారుజామున మంచు కురుస్తున్న దృశ్యాలు సాక్షి క్లిక్ మనిపించింది.

– రాజుపాళెం

పగలే వెన్నెల..!



పగలు వెలుగుతున్న వీధి లైటు

పోరుమామిళ్ల : విద్యుత్ అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగా పట్టపగలే వీధి దీపాలు వెలుగుతూ వారి నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృథా అవుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీధి దీపాల నిర్వహణలో ఉన్న సమస్యలను విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలోని కొత్రపాటిపల్లె, ముసల్‌రెడ్డిపల్లెల్లో వీధి లైట్లు పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతుండడంతో వందలాది యూనిట్లు విద్యుత్ వృథా అవుతోంది. ప్రత్యేక లైన్‌లు ఆన్‌ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేస్తేనే ఈ సమస్యకు పరిష్కారం అవుతుంది. విద్యుత్‌ను ఆదా చేయాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

వలంటీర్లను నమ్మించి మోసం చేశారు



మాట్లాడుతున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

ఖాజీపేట : 2024 ఎన్నికల ప్రచారంలో వలంటీర్లను కొనసాగించడమే కాక గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని ప్రకటించిన అప్పటి ప్రతిపక్షనేత, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వలంటీర్లకు అసెంబ్లీ సాక్షిగా ద్రోహం చేశారని వైఎస్సార్‌సీపీ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. ఖాజీపేట మండలం దుంపలగట్టులోని కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి స్వగృహంలో బుధవారం సాయంత్రం రెడ్డి విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు కుటిల రాజకీయ నీతి రాష్ట్ర ప్రజలకు అర్థం అవుతోందని తెలిపారు. వలంటీర్లపై ఎన్నికల ముందు ఒకలా ఎన్నికల అయ్యాక ఒకలా వ్యవహరించాడని, ఏటిలో ఉన్నప్పుడు ఏటి మల్లన్న ఏరు దాటాక బోడి మల్లన్న అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పథకాలను సకాలంలో ప్రజలకు చేర్చడం గడపగడపకు అందించడంలో వలంటీర్ల వ్యవస్థ కీలక పాత్ర పోషించిందని, భారతదేశానికి ఆదర్శంగా నిలిచిందని ఆయన కొనియాడారు. ప్రజలకు గొప్ప సేవలు అందించి ప్రశంసలు పొందిన వలంటీర్ల వ్యవస్థను పునరుద్ధరించాల్సిందేనని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాల్సిందేని రెడ్యం డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి, రెడ్యం నాగేశ్వర్ రెడ్డి లు పాల్గొన్నారు.

24న నగరేశ్వరస్వామికి రుద్రాభిషేకం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఉద్యాన వనంలో ఈనెల 24న సాయంత్రం 4 గంటలకు శ్రీపార్వతీదేవి సమేత శ్రీనగరేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి అష్టోత్తర శతమార్చన 102 మంది ఆర్యవైశ్య సుహాసినులచే నిర్వహిస్తారని, ఈ కార్యక్రమంలో పాల్గొని ఆర్యవైశ్య సుహాసినులు ఈనెల 22న శుక్రవారం సాయంత్రం లోపు తమ పేర్లను ఆర్యవైశ్య సభ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రత్యేక పూజలు



ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని వెంకటయ్యనగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీకోదండరామస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, ధ్వజ శిఖర కలశ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొని అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, వార్డు ఇన్‌చార్జి తుమ్మిశెట్టి వెంకటసుబ్బయ్య ఎమ్మెల్సీతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులను స్వామివారి సన్నిధిలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, ప్రముఖ పారిశ్రామిక వేత్త సానపురెడ్డిరాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పుత్తాశ్రీరాములు, కేశవరెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు బిజ్జం రమణ, అనిల్, శ్రీనివాస్‌యాదవ్, ఆవుల శ్రీను, ఆడిటర్ శివ, సాయినారాయణరెడ్డి, తుమ్మిశెట్టి సునీల్ పాల్గొన్నారు.

పరామర్శ

పోరుమామిళ్ల : మండలంలోని బొప్పాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. అయితే బుధవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి బొప్పాపురానికి వెళ్లి చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ మార్కెటింగ్ ఉపాధ్యక్షుడు కె. రమణారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



వ్యాపారస్తులకు సూచనలిస్తున్న అర్బన్ సీఐ, మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ తోపుడుబండ్లు, ద్విచక్ర వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ హెచ్చరించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, ఎస్‌ఐలతో కలిసి స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ఫుట్‌పెట్రోలింగ్ నిర్వహించి వ్యాపారస్తులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ, మున్సిపల్ కమిషనర్‌లు మాట్లాడుతూ పట్టణంలోని సిద్దవటం రోడ్డు, మైదుకూరు రోడ్డు, నెల్లూరు రోడ్డు, పోరుమామిళ్ల రోడ్డులో వ్యాపారస్తులు తమ దుకాణాల ముందు డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు. అలాగే కూరగాయల మార్కెట్ సమీపంలో సాయంత్రం వేళల్లో వ్యాపారులు రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, ఇకపై కూరగాయల మార్కెట్ బయట విక్రయాలు జరపకూడదని వ్యాపారస్తులను హెచ్చరించారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్‌ఐలు సత్యనారాయణ, రవికుమార్, పోలీసు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నియామకంపై హర్షం

మైదుకూరు : రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎం.బాలకృష్ణ యాదవ్ నియమితులు కావడం పట్ల బ్రహ్మంగారిమఠంలోని యాదవ సమాజ అన్నసత్రం అధ్యక్షుడు పెరుగు కృష్ణయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి లక్కినేని బాలరాజు యాదవ్, కోశాధికారి మేకల పెద్దన్న యాదవ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బాలకృష్ణ యాదవ్ యాదవ సమాజంలోని పేదల అభ్యున్నతికి కార్పొరేషన్ తరపున కృషి చేస్తారని తాము ఆశిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో 33 కేవీ పవర్ హౌస్ ఫీడర్‌లో ఎమర్జెన్సీ మెయింటెనెన్స్ పనుల వలన గురువారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ వీజీ శ్రీనివాసులరెడ్డి, వెస్ట్ ఏఈఈ డి.రాజబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వసంతపేట, రామేశ్వరం, పెన్నానగర్, ఈశ్వర్‌రెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు వారు తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

బీమాపై రైతులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి రామకృష్ణయ్య

గోపవరం : వివిధ పంటలు సాగు చేసిన రైతులకు ఏఏ పంటకు ఎంత బీమా చెల్లించాలనే అంశంపై బుధవారం మండలంలోని రాచాయపేట రైతుసేవా కేంద్రంలో వ్యవసాయాధికారి రామకృష్ణయ్య ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ-పంట నమోదు చేసుకుంటేనే రైతులకు పంట నమోదు పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. పంట నమోదైతేనే పంటల బీమా ప్రీమియం చెల్లించుకోవాలని, అలా కాని యెడల బీమా చెల్లించినా ఎలాంటి ఉపయోగం ఉండదని తెలిపారు. అంతేకాకుండా ఏ పంట అయితే సాగు చేస్తారో ఆ పంటను మాత్రమే ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంటల వారీగా బీమా చెల్లించాలని, వరిపంటకు రూ.630, జొన్న పంటకు రూ.315, మినుము రూ.285, పెసర రూ.270, నువ్వులు రూ.180, వేరుశెనగ రూ.480, ప్రొద్దుతిరుగుడు రూ.300 ఎకరాకు చెల్లించాల్సి ఉందన్నారు. పంట రుణాలు తీసుకున్న రైతులు రుణాన్ని రెన్యువల్ చేసుకోవడం వలన ప్రీమియం చెల్లించడం జరుగుతుందన్నారు. డ్రమ్‌సీడర్ పద్ధతి ద్వారా వరి నాటుకుంటే పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువ వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు ఓబయ్య, విజయ్, సుబ్బయ్య, రైతులు పాల్గొన్నారు.

ఎగువ రామాపురంలో ‘పొలం పిలుస్తోంది’



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారులు

కలసపాడు : మండలంలోని ఎగువ రామాపురం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఈ సంవత్సరం రబీ నుంచి దరఖాస్తు చేసుకుని ప్రీమియంను కామన్ సర్వీస్ సెంటర్‌లో చెల్లించాలని తెలిపారు. అన్ని నోటిఫైడ్ పంటలకు ప్రీమియం చెల్లించేందుకు డిసెంబర్ 15 చివరి తేదీ అని, వరిపంటకు మాత్రమే డిసెంబర్ 31 వరకు గడువు ఉందని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి 1బి, ఆధార్, బ్యాంకు పాసుపుస్తకం, పంట సాగు పత్రము తీసుకెళ్లాలన్నారు. పీఎంఎఫ్‌బీవై ప్రీమియం చెల్లించిన రైతులు పంట నమోదు కూడా చేయించుకోవాలన్నారు. వివిధ పంటలలో యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.మురళీధర్‌రెడ్డి, డీఆర్‌సీ వ్యవసాయాధికారి శైలజ, హార్టికల్చర్ అధికారి శ్రీనివాసులురెడ్డి, వీఏఏలు ఫరీద్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్లు పెంచాలి



మాట్లాడుతున్న మస్తాన్

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో ఆధార్ కేంద్రాల సంఖ్య పెంచి ప్రజల ఇబ్బందులు తీర్చాలని సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం మస్తాన్ మాట్లాడుతూ ఆధార్‌లో తప్పుల సవరణ, అప్డేట్, కొత్త కార్డు తదితర అంశాలపై నిత్యం ప్రజలు ఆధార్ సెంటర్‌కు వస్తున్నారని తెలిపారు. పోరుమామిళ్లలో ఒకే సెంటర్ ఉందని, కాశినాయన, కలసపాడు మండలాల నుంచి కూడా ఇక్కడకు ప్రజలు వస్తుండటం వలన సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

మొక్కల పెంపకంపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా క్లస్టర్ కో ఆర్డినేటర్ లావణ్య

బి.కోడూరు : సాగుకు అనుకూలంగా లేని భూమిలో మొక్కల పెంపకం చేపట్టాలని ఫౌండేషన్ ఫర్ రేకలాజికల్ సెక్యూరిటీ సంస్థ జిల్లా క్లస్టర్ కో ఆర్డినేటర్ జి.లావణ్య పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి ఉమ్మడి వనరుల అభివృద్ధి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 35 గ్రామాలకు సంబంధించిన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి భద్రత, ఆహార భద్రత, పశుగ్రాస భద్రత, ఆర్థిక భద్రత, సామాజిక భద్రత కోసం ఉమ్మడి భూమిలో మట్టి నీటి సంరక్షణ పనుల ఆవశ్యకతపై వివరించారు. ఎంపీడీఓ భాస్కర్‌రావు మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించడం వలన జల వనరులు పెరిగి పాడి పంటలు అభివృద్ధి జరుగుతుందని, జీవజాతులకు కావాల్సిన పచ్చని వాతావరణం లభిస్తుందని తెలిపారు. అలాగే ప్రకృతిని కాపాడేందుకు తమ వంతు సహాయ సూచనలు ఇస్తామన్నారు. ఉపాధి ఈసీ ఖాజానవాబ్ మాట్లాడుతూ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ప్రణాళికలో ప్రజల భాగస్వామ్యం ఉండాలన్నారు. అందరూ కలిసి ఉమ్మడి వనరులను అభివృద్ధి చేసుకోవడం వలన గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజలకు తరతరాల వారికి కూడా జీవనోపాధి లభిస్తుందని తెలిపారు. సమావేశంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు



మురికి నీరు నిల్వ ఉండటాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీలో పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. బుధవారం ఆయన మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో కమిషనర్ పర్యటించారు. ఆయన బాలాజీనగర్ -2 వద్ద ఉన్న చెత్త పాయింట్‌ను పారిశుద్ధ్య కార్మికులతో తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మోడంపల్లెలోని శేషాద్రి అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న కొత్తపల్లె ఛానల్‌లో పేరుకు పోయిన చెత్త తొలగింపును కమిషనర్ పర్యవేక్షించారు. మోడంపల్లెలోని జీవనజ్యోతి హైస్కూల్ వద్ద మురికి నీరు ఎక్కువగా నిల్వ ఉండటాన్ని కమిషనర్ పరిశీలించి రోడ్డు, డ్రైనేజీ కాలువల కోసం అంచనాలను తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. స్వయం సేవక్ వీధిలో మురికి కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

కాశినాయన : బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఇంద్రాణి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన నరసాపురంలో ఆర్థిక అక్షరాస్యతపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీజీబీ బ్యాంకు ద్వారా ఖాతాదారులకు విస్తృతమైన సేవలు అందిస్తున్నామని, బ్యాంకు సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన వారికి అధిక వడ్డీ ఇస్తున్నామన్నారు. బ్యాంకు పరిధిలో కోట్ల రూపాయలు డ్వాక్రా సంఘాలకు, రైతులకు రుణాలు అందించామన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ తిరుమలరాజు, అసిస్టెంట్ మేనేజర్ ఝాన్సీలక్ష్మి, క్యాషియర్ అనిత, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఐడీపీఎస్‌లో ముగిసిన క్రీడా సమ్మేళనం



బహుమతులు అందుకున్న విద్యార్థులు

చాపాడు : స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న క్రీడా సమ్మేళనం బుధవారం ముగిసింది. రెండు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులకు 12 ఈవెంట్లలో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వి.లోహిత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలకే అంకితం కాకుండా శారీరక దారుఢ్యాన్ని పెంచే ఆటలను ఆడటం ఎంతో ఆరోగ్యకరమన్నారు. కార్యక్రమంలో సీబీఐటీ అకాడమిక్ డీన్ డాక్టర్ జి.శ్రీనివాసులు రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ శృతి, ఐడీపీఎస్ ప్రిన్సిపల్ రవీంద్ర పాల్గొన్నారు.

రోజు ఒక పుస్తకం చదవాలి



విద్యార్థులకు బహుమతి అందిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున



బహుమతులు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



చాపాడు: బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

ప్రొద్దుటూరు : విద్యార్థులు పఠనాసక్తిని పెంపొందించుకుని రోజు ఒక పుస్తకం చదవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని శ్రీపుట్టపర్తి నారాయణాచార్యులు గ్రంథాలయంలో బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ పూర్వం లిపి లేదు కాబట్టి గురువులు చెప్పినది తాళపత్రాల గ్రంథాలను చూసి నేర్చుకునేవారన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ పెరగడం వల్ల అక్షరాల రూపంలో పుస్తకాలు వచ్చాయని, డిజిటల్ టెక్నాలజీ పెరిగిందని, విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు విద్యార్థులకు గొప్ప అవకాశం వచ్చిందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. రచయిత జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో ఉన్నంతంగా ఎదిగేందుకు పుస్తకాలు దోహదపడుతాయని తెలిపారు. వారం రోజుల పాటు వ్యాసరచన, డ్రాయింగ్, జిరాఫీ చెస్, రిటన్ క్విజ్, వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. గ్రంథాలయానికి రూ.3,500 విలువ గల పుస్తకాల ర్యాక్‌ను రిటైర్డు ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మనాభరెడ్డి అందించారు. కార్యక్రమంలో ఆర్టీపీపీ ఇంజనీర్ ప్రభాకర్‌రెడ్డి, గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ, రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు గోపినాథరెడ్డి, జేవీవీ కన్వీనర్ చంద్రశేఖర్, శ్రీరాములు, పాఠకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బుధవారం బహుమతులు పంపిణీ చేశారు. రామేశ్వరంలోని ఎస్సీసీఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో వక్తలు గ్రంథలయాల ఆవశ్యకత గురించి వివరించారు. వ్యాసరచన, చిత్రలేఖనం, పద్యపఠనం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, సర్టిఫికేట్లు, ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సత్యబాబు, వసంతపేట మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ, ఈశ్వర్‌రెడ్డినగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డీఎస్ బేగం, రవీంద్ర హైస్కూల్ ప్రధానోపాధ్యాడు ఖాదర్‌వలి, రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు రాజశేఖరరాజు, విశ్రాంత వైమానిక దళ అధికారి వెంకటకొండయ్య, గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్, రవిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

రాజుపాళెం : విద్యార్థులు పాఠశాలస్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని హెచ్‌ఎం వేలంగ్ కుమార్, గ్రంథాలయ అధికారి ప్రతాపుడు తెలిపారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలలో గెలుపొందిన వారికి బుధవారం ముగింపు సమావేశ కార్యక్రమంలో వారు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ గ్రంథాలయాల్లో అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, అందరూ వచ్చి పుస్తకాలను చదివి జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీడీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

చాపాడు : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించిన గెలుపొందిన విద్యార్థులకు బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ వంశీకృష్ణ మాట్లాడారు. గ్రంథాలయంలోని పుస్తకాలను ప్రతి ఒక్కరూ చదవాలని తెలిపారు. దినపత్రికలు చదువుట ద్వారా విద్యార్థులకు అన్ని విషయాలు సులభంగా అర్థమవుతాయన్నారు. ప్రాపంచిక జ్ఞానాన్ని పెంపొందించుకొనుటకు చక్కటి అవకాశం గ్రంథాలయాలు కల్పిస్తున్నాయన్నారు. గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో చిత్రలేఖనం, వక్తృత్వ, వ్యాసరచన, పద్య పఠన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉర్దూ హైస్కూల్ ఉపాధ్యాలు, పాఠకులు, బీడీసీ రవిశంకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మైదుకూరులో..

మైదుకూరు : స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. బుధవారం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 14న గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం నుంచి విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బుధవారం గ్రంథాలయంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ బాయ్స్ హైస్కూల్ హెడ్‌మాస్టర్ గోశెట్టి రామ్మోహన్, పలువురు ఉపాధ్యాయులు, గ్రంథాలయ నిర్వాహకుడు శ్రీనివాసరావు బహుమతులను అందించారు.